


స్పందన కొద్దిసేపట్లో వచ్చేస్తుంది.

రెండొందల మైళ్ళ దూరంనుండి రెండడుగుల దగ్గరలోకి స్పందన. అంటే రెండందమయిన కళ్ళు, పదునైన చూపు. స్పందన అంటే రెండు ముద్దొచ్చే పెదాలు, మత్తెక్కించే మల్లెపువ్వులాంటి నవ్వు. స్పందన అంటే పద్దెనిమిదేళ్ళ అందమైన అమ్మాయి. స్పందన అంటే ఇరవయ్యేళ్ళ కుర్రాడి అందమైన ఊహలూ, కలలూ, ఆశలూ ఆపాదించుకొన్న రూపం! స్పందన అంటే రూప కజిన్ సిస్టర్. (నాకయితే స్పందన గురించి ఇంకా చెప్పాలని వుంది...ఎవరు నేను? .. ..కోహం......ఎవరిచ్చారుగనక

ఈ ప్రశ్నకు సంతృప్తికరమయిన సమాధానం?.. .అయినా చెప్తాను. ప్రస్తుతానికి ఈ కథానాయకుణ్ణి. రూప భర్తను(ప్చ్!) స్పందన బావను (ఓహ్!)

స్పందనను మొదటిసారి సుమారు నాలుగు సంవత్సరాల క్రితం దురదృష్ట వశాత్తూ జరిగిన నా పెళ్ళిలో చూశాను. అప్పుడు విరిసీ విరియని మొగ్గ. స్పందనను (వీలైనన్ని ఎక్కువసార్లు ఉచ్చరించడాన్ని ఇష్టపడతాను నేను) రెండోసారి సంవత్సరం క్రితం చూశాను. అప్పుడు రేకులు విచ్చుకున్న కన్నె పూవు. అప్పట్నుంచీ నా గుండెలో ఓ రహస్యపు అరలో స్పందనను దాచి వుంచాను, నా అనాకా . . రి భార్య "అరే! ఇంకా తీరిగ్గా కూర్చున్నారేమిటి? మర్చిపోయారా స్పందన ఇవాళ వస్తుందని? త్వరగా బయల్దేరండి" అంటూ వచ్చింది.

"అవును, మర్చేపోయా న!" అహ్హహ్హ! మర్చిపోవడం సంభవమా స్పందన రాక! కాః నేనంత తెలివి తక్కువ వెధవనూకాను. పసిపిల్లవాడినీ కాను, రూపకన్నా ముందే తయారై గంతులు వేస్తూ "స్పందన వస్తుందిగా ఇవాళ! పద స్టేషనుకు!" అంటూ ఆమెకు అనుమానాన్ని కలిగించడానికి ఆమెకు నామీద నమ్మకం లేదనికాదు. ఆడాళ్ళ నమ్మకంమీద నమ్మకం పెట్టకోకూడదు. అనుమానం కలక్కుండా వ్యవహరించడం కార్యశీలి లక్షణం

వెంటనే తయారవ్వాలి. మరీ అంత నిర్లక్ష్యమూ కూడదు. ఎటాక్ మరో వైపునుంచి మొదలు కావచ్చు. మీ చుట్టాలూ మా చుట్టాలుగా విడదీసే అనుమానం ఆధారంగా. అందుకే తెలివిగా... మధ్యగా ...చేతివేళ్ళ మధ్యనుండి నీరు జారిపోతున్నట్టు చిక్కకుండా... చిక్కులో పడకుండా....

స్పందన ఇంకొద్దిసేపట్లో వచ్చేస్తుంది. రెండొందల మైళ్ళ దూరంనుండి రెండడుగుల దగ్గరలోకి.


ం ం ం

స్పందన ఇక్కడికి స్పష్టంగా కనిస్తుంది. స్పందన అంటే చుక్కల జాకెట్, చుక్కల వోణీ, అస్పష్టంగా కనిపించే అవయవాలు. అవయవాలు అనే పదం నచ్చకపోతే అందాలు.

అహ్హహ్హ! ఎవరు పసిగట్టగలరు, మొహానికట్లా పేపరు అడ్డం, పెట్టుకుని చదువుతున్నట్లు నటిస్తూ, ప్రయాణంలో అలసి నిద్రిస్తున్న స్పందనను చూస్తున్నానని? నా అనాకారి భార్య... నా అమాయకపు భార్య వంటగదిలో వుంది.

స్పందన నిశ్చలంగా నిద్రపోతోంది. సాయంసంజెనుండి చీలిన ఎర్రటి కిరణం కిటికీగుండా ప్రయాణించి నా కాళ్లదగ్గర పరచుకుంటూంది స్తబ్ధంగా

దురదృష్టవశాత్తూ బాలా దురదృష్టకరమైన బిరుదు లభించింది నాకు. మంచివాడు. నా తప్పుకాదు అది. మరెవరిది అనేముందు తప్పా, కాదా అనేది ముఖ్యమైన ప్రశ్న . నేను తర్కించదలచనిది. చిన్నప్పట్నుంచి వినయవిధేయతలు, భయమూభక్తి, అణకువతో కూడిన నడవడిక నేర్పేరు అమ్మానాన్నలు. మంచివాడనే ముద్ర పడింది. సినిమా




నటి నటులకు పడేముద్ర లాంటిదే.... బలమైంది.... అపరిహార్యమైంది,... ప్రతిక్షణమూ అదే పేరు రెన్యూ అవుతూ ఇట్లాగే కంటిన్యూ అవుతుంది. ప్రతిచర్య దాని కనువుగా అనువదించబడుతుంది. అంతా ముందే స్పష్టంగా, నిశ్చయంగా నిర్ణయింపబడుతుంది. నా స్వేచ్ఛ ధ్వంసమై... నేను నేనులా కాక కేవలం ఒక మంచి మనిషిలా. ఇదే ఇరుకు దారిన నడిపించబడి. మామగారిప్పించే ఉద్యోగమూ, ఇచ్చే కట్నాలకోసం నా కిష్టంలేని అనాకారి అమ్మాయితో నా పెళ్ళి జరిపించబడి నా ప్రమేయం లేకుండానే నా మంచితనం మహావృక్షంలా పెరిగి ఊడలు దించేసి ఏమీచేయలేని బలహీనతలూ, నిస్సహాయతల్లో నన్ను ముంచేసి... నా జీవితంలో కర్తను కాక కేవలం కర్మను కావడం....నా ఖర్మ ...

మంచి వాడుగా ఉండటం మాత్రం ఏమంత కష్టమని? నా మనసులో దౌర్భాగ్యపుటూహలు ఎవరికి తెలుస్తాయి. నా మాటల్ని, చేతల్ని పిరికితనం బేస్ మీద కొద్దిగా కంట్రోల్ చేసుకుంటుంటే?

నన్నిప్పుడు నా మంచితనం బంధించదు. నా ఉద్దేశ్యం, నా లక్ష్యం ఒకటే. నాభార్య నన్ను తన మంచి భర్తగా నమ్మొచ్చు. దాని మూలంగా నా కొరిగేదేమిటి?... స్పందన నా కౌగిట్లో ఒరిగిన క్షణాన... స్వర్గం ముంగిట్లో నేను...ఈ మంచితనము... రూప విశ్వాసం... ప్చ... ఇవేమీ నాకక్కర్లేదు. మంచివాడుగా ఉండి అనుభవించిన ఆనందం ఇక చాలు. కానియ్... ఒక దుర్మార్గుడిగా ఎస్టాబ్లిష్ కానియ్.... అందులో ఆనందమేదో అనుభవించనీ....

(నా సృష్టికర్తా! ఓ రచయితా!.... దయచేసి ఈ ఒక్క సహాయమూ.... కేవలం ఈ ఒక్క సహాయం మాత్రమే

చేయి! ఇక ఈ జీవితంలో...ప్చ్ .. ఈ కథలో నిన్నేమీ కోర్చన్ను)

ఎక్కువ రోజులుండదు స్పందన. నాలుగు రోజులు మాత్రమే. ఈ లోపలనే ..

స్పందన ఊపిరి గట్టిగా పీల్చి వదల డం విన్పిస్తుంది.

స్పందన ఇక్కడికి స్పష్టంగా కనిపి స్తుం... ంటే చుక్కల జాకెట్, ... చుక్కలనుంచి లీలగా- ... చి ... ం

... పక పకా నవ్వుతుంది పైట జారవాలున్నా పట్టించుకోకుండా. ఆ నవ్వులు నా కళ్ళకు తగిలి తళుక్కుమని మెరుపులు మెరుస్తున్నాయి. నా చూపులు స్పందన ఒళ్ళంతా తీగల్లా చుట్టుకొని నీళ్ళల్లా జారిపోతున్నాయి ఆ నవ్వుదనానికి.

"అబ్బ! ఇంక జోకులెయ్యకండి బావ గారూ! కడుపుబ్బిపోతుంది" "ఏం కడు పొచ్చిందని అందరూ అనుమాన పడతా రని భయమా!" రూప పక్కింటికెళ్ళింది.

"చీపోండి" ఆల్‌రోడ్స్ మస్ట్ లీడ్ టు ది సేమ్‌గోల్, అన్ని సంభాషణలూ అదే మలుపు తిరగాలి తాననుభవించని మధు రానందం ఒకటుందని స్పందనకు అను మానం జ్ఞప్తి ఉండాలి.

"ఎక్కడికి పొమ్మంటావు?" స్పందనా నిన్నొదిలేని! అన్నిట్లోకి అద్భుత మైంది కన్నెపిల్ల సిగ్గు. ఆ తర్వాత ఆమె నవ్వు...

"అది సరే కాని బావా! అక్కయ్య ఇంట్లో ఉన్నప్పుడు ఇంత ఫ్రీగా మాట్లాడవెందుకు నువ్వు?"

కిటికీ ఊచలకు అల్లుకున్న మల్లెతీగ వేసిన మొగ్గ ఒకటి గదిలోకి తొంగి చూస్తోంది.

"మీ అక్కయ్యకు అనుమానం!"

"ఏమనుమానం?" నీ గొంతులో అనుమానం స్పందనా!,

టేబుల్ మీది పుస్తకం గాలికి రెపరెప మంటూంది.

"ఏ ఆడదానికైన ఏమనుమానం వుంటుంది చెప్పు! తన భర్తా, మరో ఆడ పిల్లా....చెల్లెలే కావచ్చు...క్లోజ్‌గా మూవ్ అవుతూ వుంటే...." ఇదో డర్టీ బట్ ఎఫెక్టివ్ ట్రిక్. ప్రయోజనాలు రెండు. ఒకటి స్పందన హృదయంలో ఊహకు శంకుస్థాపన. రెండు అక్క మీద విశ్వాస రాహిత్యం. అటుకు దూరమయితే ఇటుకు దగ్గర అయినట్లే. కల్పితమైన ఊహకు, నిజానికి దారి నిర్మితమవు తుంది. జరగబోయే రూపకల్పనకు ఇది జస్ట్ అవుట్‌లైన్స్.

"అది కేవలం మీ అనుమానం మాత్రమే! అర్థంలేనిదికూడా!" స్పందన మెడలో ఒంటిపేట బంగారపు గొలుసు ఆమె ఒంటిరంగుతో పోటీపడాలని ప్రయత్నిస్తోంది. ఓడిపోతుందని పందెం!

"నాకు మాత్రం నమ్మకం కుదిరింది మీ అక్కయ్య అనుమానంమీద" నేను నీలో కల్పిస్తున్న అనుమానం చాలా బల మైంది స్పందనా! అది స్లో పాయిజన్. ఎటొచ్చీ మరీ స్లో కాకూడదనే నా బాధ!

"ఎట్లా?

"ఏముంది? ఇప్పుడిట్లా మనిద్దరినీ ఒంటరిగా వదిలివెళ్ళింది. మనం (కల్పిత మైన అనుమానం అప్పుడే పనిచేస్తోంది



స్పందనా!-నిన్నూ, నన్నూ కలిపి 'మనం'గా మార్చింది) దీన్ని ఒక ఛాన్స్‌గా చేసుకుంటామా లేదా అని ప్లాన్! హఠాత్తుగా వచ్చేస్తుంది నిశ్శబ్దంగా!"

"నేను నమ్మను. మా అక్క గురించి నాకు బాగా తెలుసు" నమ్మకక్కర్లేదు అనుమానించు చాలు!

"నీగురించి నీకు బాగా తెలుసుకదూ! రేపు పెళ్ళయ్యాక తెలుస్తుంది నువ్వెట్లా మారిపోతావో! అదుగో వచ్చేస్తుంది మీ అక్కయ్య"

ఉలిక్కిపడింది స్పందన. వెనక్కి తిరిగి వాకిట్లోంచి గేటుదాకా చూసింది. దట్స్ ఎనఫ్' దటీజ్ వాట్ ఐ నీడెడ్. డర్టీ ట్రిక్ క్లిక్ అవుతుంది.

"ఎక్కడా! అంతా వట్టిదే ఎందుకూ అబద్ధాలు?" సర్దుకుని టేబుల్‌మీద బుక్ తీసికొని తిరగేస్తూంది స్పందన ఏదో కార్టూన్ బహుశా బాపూదే అయుండొచ్చు చూసింది కాబోలు.

○ ○ ○

స్పందన నన్ను ఇష్టపడుతూంది. స్పందన నన్ను వాంఛిస్తుంది. సందేహం లేదు. లేకపోతే అలా కళ్ళలో కళ్ళుపెట్టి చూడదు. నాతో అంత ఫ్రీగా ఉత్సాహంగా మాట్లాడదు. స్పష్టంగా కనిపిస్తుంది, స్పందన కళ్ళలో నాపైన గాఢమైన కోరిక (ఏమోనబ్బా) షటప్!

ఫర్‌ఫర ఫరాఫర్! ఈరోజున నా మంచితనం ముక్కలు ముక్కలు కాబోతుంది ఎవరన్నారు చెడిపోవడం కష్టమని? ఇప్పుడు తెలుస్తుంది చెడగొట్టేవాళ్ళున్నప్పుడు రహస్యంగా చెడిపోవడం ఎంత తేలికో! కొద్దిగా ఇగ్నిషన్. అది చాలు. విచారకరంగా ఆనందం కల్గించేవన్నీ దాదాపు తప్పులుగా పరిగణించ

బడతాయి సృష్టి ప్రారంభమైన ఇన్ని కోట్ల సంవత్సరాలదాకా చెడు ఉండంటే కారణం ఇదే

నా కాంక్షను ముసుగులో దాచటం అనవసరం మనిషికి అన్నిటికన్నా ముఖ్యమైంది నిజాయితీ. నా దుర్మార్గపు మనసును నిర్భయంగా నిజాయితీగా బయటపెట్టేస్తాను. ఈ అబద్ధపు మంచి తనం నాకెందుకూ? . ఎందుకూ ఈ ఆత్మవంచనా లోకవంచనా. కృత్రిమ జీవనమూ ? ఇది స్టార్ట్. ఈ రాత్రికి అందమైన శ్రీకారం చుట్టబడబోతుంది. శోభాయమానమైన ప్రారంభోత్సవం జరగబోతుంది. ఇక దొంగాటలకూ, దాగుడుమూతలకూ, దాపరికాలకు స్వస్తి.

నాకు ఇష్టం. స్పందనకు ఇష్టం (!) ఇది కేవలం ఇద్దరు వ్యక్తులమధ్య ఒడంబడిక. ద్విపాత్రల అభినయం. మూడో వ్యక్తికి సంబంధించనిది. మూడోవ్యక్తికి అభ్యంతరం తెలపడానికి హక్కులేనిది. అట్లా అభ్యంతరం ఉండేటట్లయితే, ఆ అభ్యంతరం ఈ జరగబోయే కార్యక్రమాన్ని నిరోధించగలిగేటట్లయితే. మనిషికి ఉన్న స్వాతంత్ర్యం ఏమిటి? ఈ అనవసరపు కట్టుబాట్లకు పశువుల్లా, బానిసల్లా లొంగి ఉండే ఖర్మేమిటి మనకు? దీనిమూలంగా ఎవరికి నిజమయిన హాని కలుగుతుంది? రెండు జీవులకు నిజమైన సంతోషం తప్ప!


కనీసం ఈ ఒక్కరాత్రయినా 1947 లో భారతదేశ ప్రజలకు వచ్చిన స్వాతంత్ర్యాన్ని వినియోగిస్తాను. ఎందరో మహానుభావులు బోధించిన నిజాయితీ కలిగి ఉంటాను.

అసలు నేనింతగా సమర్థించుకోవలసిన బాధేమొచ్చిపడింది? ఎలాగూ జరగబోయేది మూడో వ్యక్తి అయిదో కంటికి తెలియబోవడంలేదు. మంచిచెడల గొడవ అస్సలు అక్కర్లేదు. కాబోయేది ఒక సదవకాశ సద్వినియోగం. రెండు దేహాల సంయోగం మహాయోగం. . తప్పునిసరిగా చావుకన్నా తప్పనిసరిగా. ఈరాత్రే జరగబోతుంది. ఎందుకంటే .

○ ○ ○

స్పందనకూ, నాకూ మధ్య దూరం అరడుగు. నా కాలు అరడుగు దూరం కదల్చగలిగితే స్పందన కాలు తగులుతుంది. నా చేయి అరడుగు కదల్చగలిగితే స్పందన చేతి స్పర్శ నా మెదడుకు అందుతుంది.

గంటనుండీ దీన్ని అనుభవిస్తున్నాను. నాకూ చాలా సంతోషంగా వుంది. ఈ విశాలంగా లేని పడగ్గదిలో నేనో మంచం మీదా! స్పందనా రూపా మరో మంచం మీదా (మంచం ఏమిటి చెత్తగా! బెడ్ అంటాను రచయితా! అయినా దాన్ని గురించి నే పట్టించుకోదలచుకోలేదు) రూప ఇటుప్రక్క పడుకోవలసింది. కాకతాళీయంగానో, నా డర్టీ ట్రిక్ మూలంగానో, తన అక్కను పరీక్షింపదలచుకొనో స్పందన ఇటుప్రక్క పడుకుంది. నా అమాయకపు భార్య ఇదంతా గమనించలేదు. నా అమాయకపు భార్య ఇదంతా గమనించలేదుకూడా. అందుచేత నిశ్చింతగా గాఢంగా నిద్రపోతుంది. అయినా రెండు నిమిషాలు ఆగుతాను. తర్వాత మెల్లగా స్పందనను తడతాను.




లేస్తుంది. 'అరవకు' అన్నట్లు సంజ్ఞ చేస్తాను. 'నాతోరా' అంటూ దారి చూపిస్తాను. మరో గదిలోగాని, పెరట్లోగాని... స్పందన కౌగిట్లో వెన్నెట్లో.. రెండు ఒకటై, శూన్యమై అభౌతికంలోకి, అలౌకికంలోకి తేలి..

ది ప్రైమ్ హేడ్ కమ్. సమయం ఆసన్నమయింది.

కానీ కానీ.. నా చేయి జరగదేం? నాకాలు కదలదేం?.. పక్షవాతం వచ్చినట్టు .టన్నుం బరువెక్కినట్టు. నా గుండె డబ్‌డబ్ మంటూ యుద్ధ నగారా లాగా రెచ్చిపోతుంది. మొహంలో నెత్తురు కమ్ముకొస్తోంది వెచ్చగా ఎక్కడో వణుకు అర్ధరాత్రి దూరంగా వినిపించే ఏడుపులాగా! ఏమిటిది భయమా? ధైర్యమంతా ఎటుపోయింది? కేవలం క్షణంలో వెయ్యోవంతు కదలిక చాలు, పునాదికి. దానంతట అదే కొనసాగించబడుతుంది తర్వాత.

ప్చ్! అక్కర్లేదు. అక్కర్లేదు .ఏమిటి నేను చేయబోతుంది? ఓరి ధూర్తుడా! మూర్ఖుడా! ఏమిటి నవు చేయబోతున్నది? తెలుసుకున్నావా? మంచు బిందువులా స్వచ్ఛంగా, అమాయకంగా ఉండి, అశుభమూ, శుభమూ తెలియని కన్నెపిల్లను, తన రాబోయే భర్త కోసం, అతని కోసం తను దాచిన తన సర్వస్వాన్నీ అర్పించుకునే క్షణంకోసం కలలుకనే ముగ్ధత్వాన్ని సర్వ నాశనం చేస్తావా? ఈ సౌందర్యాన్నీ సౌశీల్యాన్నీ, పవిత్రతను మలిన పరచడమా? కేవలం భ్రమ కళ్ళకు కప్పిన పొర. అంతే ఎంత ఘోరం? నా సిగ్గూ, బుద్ధీ ఏమయ్యాయి? స్పందన భవిష్యత్తు ఏమవుతుంది? అంతా భ్రమ చనువుగా మాట్లాడినంత మాత్రాన మోహపడినట్లా? కాకతాళీయంగా చూపులు కలిసినంత మాత్రాన చేయి పట్టుకోవడమా? నా చేయి

తగిలిన క్షణాన ఉలిక్కిపడి లేచిన స్పందన కేక. విసిలేచిన రూప కళ్ళ నుండి అగ్నిజ్వాలా తట్టుకోగలనా? స్పందన దృష్టిలో నా స్థానం, నా పాతికేళ్ళ మంచితనం, నా మంచితనం మీద నమ్మకముంచిన.. అనాకారే కావచ్చు... కాని నా భార్య దృష్టిలో నేను, నూరేళ్ళ సంసారం అంతా అంతా ధ్వంసం ..

మనసా నువ్వొట్టి కుక్కవే! నిజాయితీ, స్వాతంత్ర్యమూనా! ట్రాష్! ఒక హంతకుడు ఇంతకన్న సమర్థవంతంగా సమర్థించుకోగలడు తన అకృత్యాన్ని! భాష నా చేతిలో ఉంది కాబట్టి పదాలను నా స్వార్థానికి, నా స్వార్థ సమర్థనకు ఉపయోగించుకున్నాను. మరి నీతి, మానవత్వమూ ఏమయ్యాయి? చేసిన పాపపుటాలోచనకు సమర్థన కూడానా! దేవుడు చూస్తూనే ఉంటాడు ప్రతిక్షణమూ వేయికళ్ళతో. నా పాపానికి శిక్షిస్తాడు చిత్రవధ చేస్తాడు .. ఆపాపపు టాలోచన వచ్చినందుకే ఆత్మహత్య చేసుకో వచ్చును. ఎంత అన్యాయం? ఎంత అక్రమం? నా అమాయకపు భార్యనూ, స్పందననూ ఒకే క్షణంలో ఘోరంగా వంచించ బోయాను! ఎప్పటినుంచి ఉన్నాడు నాలో ఇంత దుర్మార్గుడు? ఎంత అసహ్యం! నా దేహంలో ప్రతి కణానికీ తెలుసును ఇది తప్పని! నేను క్షమించను ఈ రాక్షసుణ్ణి! కేవలం మూడేమూడు నిమిషాల సుఖంకోసం నరకానికి ముఖ ద్వారం ఆకర్షణీయంగా ఉంటుంది రాక్షసుడా!

నే పెరిగిన ఈ సంఘపు కట్టుబాట్లు నన్ను తృణీకరించడమా! ఏ కట్టుబాట్లు ననుసరించి నే నిన్నాళ్ళూ లాభించానో, ఆనందించానో, అవే కట్టుబాట్లను మరో తాత్కాలిక సుఖం కోసం నిర్లక్ష్యం చేస్తున్నానంటే వాటి మీద నాకున్న గౌరవం ఏపాటిది? .వట్టి అవకాశ వాదం! కృతఘ్నత? స్పందన స్థానంలో నా భార్య, నా స్థానంలో మరొకడు ఉంటే ఏ రీజనింగ్‌తో వాళ్ళ సంబంధాన్ని అక్రమం అనగలిగే వాణ్ణి! కాని యే! నేను పిరికి వాణ్ణయితే కానీ! చేత కాని వాణ్ణయితే కానీ యే! ఈ ఘోరం నా వల్లకాదు ఇటు తిరిగి పడుకున్నాను.

(ఒకవేళ ఇప్పుడ స్పందన లేచి నీపై వాలిందనుకో! అప్పుడు కూడా ఈ పారాన్నంతా వల్లించగలవా మానవుడా! స్పందన కోరికను తిరస్కరించగలవా?)

సాౕన్ ఎప్పటికీ చావదు,

ఆశ కూడా. మొండిగి. అటు తిరిగేతే ..

స్పందనకూ నాకూ మధ్యమాగం అరడుగు. నా కాలు అరడుగు దూరం కదల్చ కలిగితే. స్పందన కాలు తగులుతుంది నా చేయి అరడుగు దూరం కదల్చ కలిగితే స్పందన చేతి స్పర్శ నా మెదడుకు అందుతుంది,

ం ం ం


స్పందన నాకేసి తలత్రిప్పి చూసింది. క్షణంలో వందో వంతు సేపు. మా చూపులు కలిసి విడిపోయాయి

"ఏమిటి ఇట్లా పడుకున్నావు స్పందనా?" నా హృదయ స్పందనా!

"కొంచెం తలనొప్పిగా ఉంది!"

"మీ అక్కయ్యేద!" ఇంట్లో లేదనే అను(కోవచ్చు!)

"మార్కెట్ వెళ్ళింది నేను తల నొప్పిగా ఉందని చెప్పి పడుకున్నాను"




తల నొప్పిగా ఉందని చెప్పి .. ఉందని చెప్పి . .అంతే లేదనే .. చిన్న అయిడియా నాకోసం . . నాకోసం... రాత్రి నిన్ను అనుమానించాను స్పందనా... నీకు నాపై నిజంగా కోరిక లేదనీ . నా భ్రమేననీ. .దురదృష్టవంతుడినైన ధర్మా ర్గణి నేను? రాత్రి ధైర్యం చేయలేక పోయాను. ఇప్పటికైనా మించి పోయింది లేదు. మంచిప్లాన్ వేశావు. మీ అక్కయ్య మరో గంటదాకా రాదు. (మనసా! ధ్వా!)

"ఫ్లాస్కులో కాఫీ ఉంది తాగమనండి"

నా పెదవుల్లో మధువుంది. తాగమను నువ్వు-రాత్రి నా పిరికితనం మూలంగానే బాధపడి, నిన్ను బాధ పెట్టి ఉంటాను. చెడిపోవడానికి కొద్దిగా గుండె దిటవు కావాలి స్పందనా! దురదృష్టవశాత్తు దుర దృష్టకరమైన కాన్ఫ్లిక్ట్ నన్ను రాత్రి ఘోరంగా ఓడించింది. నేనిప్పుడు చాల ధైర్యంగా ఉన్నాను. (మళ్ళీ నన్ను పాత భ్రమే కొత్తగా కళ్ళను కప్పుతుంది మనసా!) షటప్‌ప్‌ప్ కిటికీ రెక్కలు గాలికి కొట్టుకుంటున్నాయి అగ్నీ కాంట్ వెయిట్-క్షణం కూడ ఆలస్యం చేయను.

నా నడుం వంగి నా చేయి మెల్లగా ఆమె చేయిని పట్టుకుంది. షాక్, షాక్ దగా .మోసం. ఎవరా అన్నది. అందమైన ఆడపిల్ల చేయి తాకగానే ఒళ్ళు జల్లు మంటుందని, కరెంటు షాక్ కొట్టినట్లు ఉంటుందని...చెత్త ...ఏమిలేదు. కాకుంటే కొద్దిగా వేడిగా ఉంది. లేక నాలో ఆ అనుభవాన్ని అందుకునే లాలిత్యం నశించిందా? ఛనీ!

ఇప్పుడు స్పందన చేయి పైకి తీసి నా పెదవులతో ముద్దు పెట్టుకోవాలి యాక్షన్ రెడీ వన్ టూ త్రీ

"అంత వేడిగా ఉన్నట్లు లేదుకదూ! ధర్మామీటరుతో చూశాను ఇందాక నైటీ

సైన్ పాయింట్ పైవుంది అంతే"

ఐ కాంట్, నా చేయి స్పందన చేతిని వదిలేసింది. ఘోరమైన ప్రమాదం తప్పి నట్లుగా నా ఊపిరి తిత్తులు గాలిని పీలు స్తున్నాయి.

"అవును అయినా నువ్వు రేపే వెళ్ళ డము ఎందుకు? ఇట్లా ఉంటే ఎల్లుండి వెళుదువు గాని."

ఉలిక్కి-పడి చూచింది స్పందన గాలికి టపటప కొట్టుకుంటున్నాయి కిటికీ తలుపులు.

"ఏమిటీ ఎల్లుండా?"

స్పందన తల తిప్పి నాకేసి చూసింది క్షణంలో వందో వంతు సేపు మా చూపులు కలిసి విడిపోయాయి.

o o o

స్పందనకూ నాకూ మధ్య దూరం అరడుగు. నరకంలో నిద్రపట్టని నాలుగో రాత్రి అనుభవిస్తున్నాను.

ఒకటి మాత్రం నిజం. నేనూహించిన విధంగా, నేను స్పందన ఒకటయినా నాకు అసంతృప్తి, అశాంతి మిగలడం తథ్యం! రూప ఎదుట నిర్భయంగా నిలువలేను

వ్చ్ ..చెత్త సమర్థన, చేతకానితనానికి అందమైన ముసుగు. ఒకటి మాత్రం నిజం

ఏది నిజం...ఇంకా నేను నిజం చెప్ప గలిగే స్థితిలో ఉన్నానా? నేను చేయదల చుకున్నదేమిటి? చేయబోతున్నదేమిటి? చేయలేక పోతున్నదేమిటి? నన్ను నేనెరు గుదునా?

బ్రహ్మాండమైన సంజాయిషీ ఇచ్చు కోవచ్చు పరిస్థితి ఎదురు తిరిగినా. పొర పాటున రూప అనుకుని స్పందన మీద చేయి వేశానని ఒప్పుకుంటా సరేసరి.

ఏది మంచి? ఏది చెడు? మంచీ మంచిది కాదు. చెడూ మంచిది కాదు. మంచీ చెడ్డది కాదు చెడూ చెడ్డది కాదు, ఇగింతే!

ఆ అమాయకమైన అమ్మాయి స్పందన చెడు దారిలో పోతుంటే మంచి దారికి మళ్ళించవలసిన బాధ్యత, స్థితి లోనూ ఉన్న నేను ఇట్లా చేయటం ఎంత వరకు భావ్యం?

అవతలి ఒడ్డు చేరాలని ప్రతి ఒకక్క రికి ఉండవచ్చు. కాని మధ్యలో ప్రవాహం ఎంత కష్టం , ఘోరమూ,నిరంతరమూ అయిన సంఘర్షణ, అంతరంగ మథనం అలలు మొహాన కొట్టి మంచెత్తించి మళ్ళీ మొదటి ఒడ్డుకే చేరుస్తాయి యా!

చేయబోయే ...వ్చ్ .చేద్దామనుకునే పాపానికి నా అంతరంగం శిక్షిస్తుంది నన్ను స్పందన అంగీకరించినా, స్పందన జీవితం . ? సంఘంలో స్పందన స్థితిగతి, భగవంతుడా!

ఆలోచనలు అగ్నిపర్వతాల్లా పేలి, పేలికలై, అల్లకల్లోలము చెలరేగి

నేను నిస్సహాయుణ్ణి శవం కన్నా. ఆశక్తుణ్ణి బొమ్మకన్నా-చపటన, దద్ద మ్మను, పిరికివాణ్ణి, దుర్మార్గుణ్ణి, నీచుణ్ణి క్షుద్రుణ్ణి, దరిద్రుణ్ణి

"ఈ అనంతమైన విశ్వంలో, ప్రచండమైన వేగంతో పరిభ్రమించే కోటానుకోట్ల గోళాల మధ్య" పిపీలిక ప్రమాణంతో తన ఉనికిని నిలుపుకునే ఈ భూగోళం మీద ఒక చిన్ని జీవం - మనిషి -ఆ మనిషి సృష్టించిన సామాన్యమైన కథలో సామాన్య పాత్ర -ఆ పాత్రలో సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మ - ఆ చిన్న పరిధిలో ఇన్ని కాంప్లికేషన్లు ఎందుకు?

(ఓ రచయితా! బి ఫ్రీ మై సోల్! నా సృష్టికర్తా! నిన్ను వేడుకుంటున్నాను. ఈ దుర్భరమయిన వేదన నుండి' సంఘర్షణ నుండి విముక్తి ప్రసాదించు దయచేసి ఈ కథ త్వరగా ముగించు నాకు ఈ స్పందన అక్కర్లేదు ఈ బ్రతుకూ అక్కర్లేదు అసలేమీ అక్కర్లేదు )

స్పందనకూ, నాకూ మధ్య దూరం అరడుగు. నరకంలో నిద్ర పట్టని నాలుగవ రాత్రి అనుభవిస్తున్నాను.

o o o

స్పందన వెళ్ళిపోతుంది. రెండువందల మైళ్ళ దూరంలోకి

"జ్వరం తగిలి వెళుతున్నావు వద్దన్నా వినకుండా! అక్కడేం మునిగిపోతుందని?"

"ఊఁ నువ్వు మరీ కొద్ది తలనొప్పికే కంగారు పడతావక్కా! చూడండి బావగారూ అక్కా!"

"మీ అక్క అంతే! తలనొప్పితో పడుకుంటే ఆపరేషన్ చేయవలసొచ్చినట్లు కంగారు పడతుంది"

"మీకు స్పెషల్ థాంక్సు చెప్పాలి బావగారు! మంచి కంపెనీ ఇచ్చారు. ఊరంతా చూపించారు"

"అయ్యో! అవన్నీ మీ బావకు మామూలే! మహా మంచి మనిషి పాపం"

క్షమించు రూపా!

"మొన్నీమధ్య ఎవరో స్నేహితుడి తమ్ముడు వచ్చాడని నాలుగు రోజులు సెలవు పెట్టి ఊరంతా చూపించారు."

"అదుగో గార్డు పచ్చజెండా ఊపుతున్నాడు"

"జాగ్రత్త స్పందనా!"

"మళ్ళీ ఎప్పుడొస్తావు స్పందనా!" మళ్ళీ అవును సాతాన్ ఎప్పటికీ చావడు

"మళ్ళీ ఎప్పుడో ఒకప్పుడు" చిరునవ్వుతూంది స్పందన.

స్పందన చేయూపుతూంది.

ఒకందుకు మాత్రం సంతోషంగా వుంది. నాకేమంత విచారంగా లేదు

ప్లాట్‌ఫాంనుండి ఎక్స్‌ప్రెస్ వెళ్ళిపోతూంది నా గుండెల్లోంచి వెలికొచ్చిన అర్థంకాని నిట్టూర్పులా.

హృదయంలో నాలుగు రోజుల క్రితం మొదలయిన తుఫాను సమసిపోయింది ఏ ఘోరమూ జరక్కుండానే భయంకరమైన యుద్ధం ముగిసిపోయింది.

"వెళ్దాం పదండి!"

"పద"

స్పందన వెళ్ళిపోతోంది, రెండొందల మైళ్ళ దూరంలోకి ★